క్లుప్తంగా

జిల్లా కలెక్టర్‌ను కలిసిన నేదురుమల్లి



కలెక్టర్ ఆనంద్‌కు డైరీని అందజేస్తున్న నేదురుమల్లి

సైదాపురం: నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్‌ను శుక్రవారం వైఎస్సార్ సీపీ వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సరంతో పాటు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గంలోని పలు సమస్యలపై కలెక్టర్‌తో చర్చించారు.

సచివాలయ సిబ్బందిపై ఫిర్యాదు

సైదాపురం: మండలంలోని కలిచేడు గ్రామ సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించడ లేదని స్థానికులు శుక్రవారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఉదయం 11 గంటల తర్వాతే విధులకు వస్తున్నారని, ఆఫీసులో ఎవరూ ఉండడం లేదని పేర్కొన్నారు. చిన్న పని కోసమైనా పలుమార్లు తిరగాల్సి వస్తోందని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలి



మహిళలకు శిక్షణ ఇస్తున్న నిర్వాహకులు

రాపూరు: గిరిజన గ్రామాల్లోని ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలని ఐటీడీఏ పీవో పరిమళ తెలిపారు. రాపూరు వెలుగు కార్యాలయంలో శుక్రవారం వన్‌ధన్ వికాస్ కేంద్రాల్లోని గిరిజన మహిళలకు ఉసిరి ఊరగాయ, షర్బత్, కుంకుడుకాయ పౌడర్, షాంపు తదితరాల తయారీపై శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 15 గిరిజన గ్రూపులు ఉన్నాయన్నారు. వీటిలోని సభ్యులు అడవుల్లో సేకరించిన మారేడుగడ్డ, కుంకుడు కాయలు, వట్టివేర్లు తదితరాలతో సొంతంగా షాంపూలు, షర్బత్ తయారు చేసి విక్రయించాలని సూచించారు.

గ్రామదేవతకు సామూహిక పొంగళ్లు



దేశమ్మను ఊరేగిస్తున్న గ్రామస్తులు

చిల్లకూరు : మండలంలోని బల్లవోలు గ్రామ దేవత దేశమ్మకు శుక్రవారం గ్రామస్తులు సామూహిక పొంగళ్లు పెట్టారు. గ్రామస్తులు ముందుగా ఆలయ ఆవరణలో అమ్మవారికి, అక్క చెల్లెళ్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్క దేవతలతో కలిసి అమ్మవారిని గంపల్లో పెట్టుకుని గ్రామంలో ఊరేగించారు. అనంతరం బోనాలతో ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న దువ్వూరు శేషురెడ్డి

చిట్టమూరు(చిల్లకూరు) : చిట్టమూరు మండలం మల్లాం పంచాయతీ కోటిగుంట గిరిజన కాలనీలో 50 కుటుంబాలకు శుక్రవారం నెల్లూరుకు చెందిన మహతి పెయింట్స్ అధినేత దాతృత్వంతో దుప్పట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు దువ్వూరు శేషురెడ్డి, ఎంపీటీసీ మధురెడ్డి, టీఎంఆర్ పాఠశాల ప్రిన్సిపాల్ రహంతుల్లా, మేనేజర్ శీనయ్య పాల్గొన్నారు.

దళితజాతిని విభజిస్తున్న చంద్రబాబు

సూళ్లూరుపేట: సీఎం చంద్రబాబు దళితులపై కక్ష కట్టి దళిత జాతిని విభజిస్తున్నారని మాజీ ఎంపీ డాక్టర్ చింతామోహన్ ఆరోపించారు. ఆయన శుక్రవారం సూళ్లూరుపేట బస్టాండ్ సెంటర్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత విభజన వద్దు–అది దేశానికి ముద్దు అన్న నినాదంతో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ దళిత జాతిని విడదీసి దళిత ద్రోహిగా మిగిలిపోవద్దని హితవుపలికారు. దుగరాజపట్నం ఓడరేవును తీసుకువస్తే నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఫ్లెమింగో ఫెస్టివల్ పేరుతో రూ.ఆరు కోట్లు స్వాహా చేసేందుకు కూటమి నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీనిపై విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేసి విచారణ చేయిస్తామన్నారు. చందనమూడి శివ, వెంకటకృష్ణయ్య, రాజేంద్రన్, వెంకటయ్య పాల్గొన్నారు.

టీడీపీ నేతలపై గ్రామస్తుల ఆగ్రహం

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరులో ఉన్న వీపీఆర్ ఫౌండేషన్ వాటర్ ప్లాంట్‌లో 10 లీటర్ల వాటర్ క్యాన్‌కు రూ.20 వసూలు చేస్తున్న టీడీపీ నేతలపై స్థానికులు శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి సొంత నిధులతో గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఉచితంగా తాగునీరు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆయనపై కొందరు టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. అధికారం అండతో వైఎస్సార్‌సీపీ వర్గీయులపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ నేతలు తీరు మార్చుకోవాలని హితవుపలికారు.

ఖాళీ అయిన గ్రామాలు

నేలపట్టులో నిరుపయోగంగా ఉన్న గతంలో అతి పెద్దవిగా వెలిసిన భవనాలు





పక్షులు సంతానోత్పత్తి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళుతుంటాయి. గుడ్లు పెట్టి పిల్లలను పొదిగిన తర్వాత అవి మళ్లీ సొంత గూటికి చేరుకుంటాయి. కొన్ని గ్రామాల ప్రజలు కూడా తమ జీవన విధానాన్ని మార్చుకున్నారు. పట్టణాల్లో నివాసాలు ఏర్పరుచుకుంటున్నారు. వ్యవసాయ పనుల సమయంలో మాత్రమే గ్రామాలకు వచ్చి కొద్ది రోజులు ఉండి తిరిగి వెళ్లిపోతున్నారు. దీంతో పలు గ్రామాలు బోసి పోయాయి. శిథిలమైన ఇళ్లు, పిచ్చిమొక్కలతో మూసుకుపోయిన వీధులు దర్శనమిస్తున్నాయి.

- పట్టణాల్లో నివాసం ఏర్పరుచుకుంటున్న గ్రామస్తులు
- వ్యవసాయ పనుల కోసం గ్రామాలకు వస్తున్న వైనం
- ఎన్నికల సమయంలో గ్రామాల్లోనే మకాం
- పాడుబడిన భవంతులు, ఇళ్లు

దొరవారిసత్రం : దొరవారిసత్రం మండలంలో ఎక్కువ మంది వ్యవసాయం ఆధారపడి జీవనం సాగించేవారు. వారిపై ఆధారపడి కూలీలు, ఇతర పనులు చేసుకునేవారు జీవనం సాగించేవారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడం, పిల్లల చదువు పెద్ద సమస్యగా మారడంతో వందల సంఖ్యలోని రైతు కుటుంబాలు నాయుడుపేట, సూళ్లూరుపేట తదితర పట్టణాలకు వెళ్లారు. ముఖ్యంగా నేలపట్టు, కొత్తపల్లి, నెల్లూరుపల్లి, ముచ్చలుగుంట గ్రామాల్లో వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించేవారే. ఈ గ్రామాలు ఒకప్పుడు రైతుల కుటుంబాలతో కళకలాడేవి. ఇక్కడ నాయుడు, రెడ్డి, యాదవ సామాజిక వర్గం వారు ఉన్నారు. నేలపట్టు గ్రామంలో గతంలో 100 కుటుంబాలకు పైగా ఉండేవి. నేడు పది కుటుంబాలు లేవు. అదే విధంగా కొత్తపల్లి గ్రామంలో నాయుడు సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు 100కు పైగా ఉండగా ప్రస్తుతం 20 కుటుంబాలు కూడా లేవు. ఈ ప్రాంతాల్లోని రైతు కుటుంబాలు నాయుడుపేటలో నివాసం ఏర్పరుచుకున్నారు. నెల్లూరుపల్లి, ముచ్చలగుంట ప్రాంతాల్లోని రెడ్డి, యాదవ సామాజిక వర్గానికి చెందిన 50 కుటుంబాలు బయట పట్టణాల్లో స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. వెదురుపట్టురాజు పాళెం గ్రామంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో 20 మంది రైతు కుటుంబాలు పదేళ్ల క్రితం వెదురుపట్టు ఎస్టీ కాలనీ సమీపంలో ఇళ్లు నిర్మించుకుని వెళ్లిపోయారు. దీంతో ఈ గ్రామాలు నిర్మానుష్యంగా మారాయి. చక్కగా నిర్మించిన భవంతులు సైతం బూత్ బంగ్లాల్లా మారాయి. రాత్రిళ్లు ఆయా ప్రాంతాల్లో సంచరించాలన్నా భయపడే పరిస్థితి నెలకొంది.

ఓట్ల వినియోగం గ్రామాల్లోనే...

రైతులు గ్రామాలను విడిచి నాయుడుపేట, సూళ్లూరుపేట, నెల్లూరు పట్టణాలతోపాటు చెన్నైలో స్థిరపడ్డారు. ఎన్నికల సమయంలో ఓట్లు వేసేందుకు గ్రామాలకు చేరుకుంటారు. ఎన్నికల రోజున అందరూ ఓట్లు వినియోగించుకుంటారు. చౌక దుకాణంలో నిత్యావసర సరుకులను క్రమం తప్పకుండా తీసుకుంటారు. సీజన్‌లో వ్యవసాయ పనులు చేసేందుకు వచ్చి వెళతారు.



వెదురుపట్టురాజుపాళెంలో మూత బడిన పక్కాగృహాలు





కొత్తపల్లి గ్రామంలో కాపురాలు లేక శిథిలావస్థకు చేరిన గృహాలు

వ్యాపారం కోసం వెళ్లాం



కొత్తపల్లి గ్రామాల నుంచి పదుల సంఖ్యలో రైతులు పట్టణాల్లో వ్యాపారం కోసం వెళ్లారు. మరి కొంతమంది ఇక్కడ వసతులు లేక పోవడంతో వెళ్లిపోయారు. గ్రామం చాలా వరకు ఖాళీ అయింది. వ్యవసాయ పనుల సమయంలో వచ్చి పనులు చేసుకుని వెళ్లిపోతారు.

\- సీహెచ్ మురళీనాయుడు, కొత్తపల్లి

పిల్లల చదువుల కోసం వెళ్లాం



మా గ్రామంలోని ఎక్కువ మంది పిల్లల చదువుల కోసం నాయుడుపేట, సూళ్లూరుపేట వంటి పట్టణాలకు వెళ్లారు. మేము కూడా అక్కడే స్థిర నివాసం ఏర్పరుచుకున్నాము. పట్టణాల్లో ని వాతావరణం, అక్కడి అలవాట్లు వంటబట్టడంతో ఇప్పుడు గ్రామాల్లోకి రాలేని పరిస్థితి ఏర్పడింది.

\- ఎన్.రామయ్య, నేలపట్టు

అప్పట్లో వసతులు లేక వెళ్లాము



కొత్తపల్లిలో మౌలిక వసతులు ఉండేవి కాదు. విద్య, వైద్యం అందని పరిస్థితి. దీంతో మా గ్రామానికి చెందిన చాలా కుటుంబాలు నాయుడుపేటలో స్థిరపడ్డాయి. ఇప్పుడు గ్రామంలో అన్ని సదుపాయాలు, వసతులు ఉన్నా రాలేని పరిస్థితి. గ్రామంలో ఇళ్లు శిథిలమవుతుంటే చాలా బాధగా ఉంది.

\- ఎన్.రామచంద్రనాయుడు, కొత్తపల్లి

శిథిలం.. నిరుపయోగం...



నేలపట్టు గ్రామంలో కాపురాలు లేని పలు గృహాలు శిథిలావస్థకు చేరాయి. మరి కొందరి భవనాలు నిరుపయోగంగా మారాయి. గ్రామంలోని వీధులు సైతం ముళ్ల చెట్లుతో మూసుకుపోయాయి. దీంతో గ్రామంలో బిక్కుబిక్కు మంటూ తిరగాల్సి వస్తోంది.

\- ఏ మురళీ, నేలపట్టు

సమస్యలకు పరిష్కారమేదీ..?



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పెళ్లకూరు : మండల సర్వసభ్య సమావేశంలో టీ, సమోసా ఇస్తున్నారు తప్ప సమస్యలకు పరిష్కారం చూపడం లేదని జీలపాటూరు సర్పంచ్ కందమూడి శివకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జీలపాటూరులో బోర్లు లేక ప్రజలకు తాగునీరు ఇవ్వలేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. శిరసనంబేడు సర్పంచ్ గుంటపూడి పెంచలయ్య మాట్లాడుతూ పంచాయతీ అనుమతి లేకుండానే ఇష్టానుసారంగా సిమెంట్ రోడ్లు వేస్తున్నారని ఎంపీడీవో ప్రమీలారాణికి ఫిర్యాదు చేశారు. వైస్ ఎంపీపీ బెల్లపు రాఘవరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులకు స్వర్ణముఖినది నుంచి ఇసుక తీసుకెళుతుంటే పోలీసులు అడ్డుకుంటున్నారని వాపోయారు. ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ చిల్లకూరులో ఉన్న వీపీఆర్ ఫౌండేషన్ వాటర్ ప్లాంట్, మండల పరిషత్ గ్రాంట్, చింతంరెడ్డి గంగిరెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన మరో వాటర్ ప్లాంట్‌ను స్వాధీనం చేసుకుని ప్రజలకు ఉచితంగా నీరు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఇలకా సుధారాణి, స్వర్ణముఖి సిస్టం ఆయకట్టు చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, డీటీ యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్‌లో హజరత్ అమీర్‌షావలీ గంధోత్సవం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలో ప్రతి ఏటా ఎంతో ఘనంగా జరిగే హజరత్ అమీర్‌షావలీ గంధోత్సవాన్ని ఏప్రిల్ 3, 4, 5 తేదీల్లో నిర్వహించనున్నట్టు టీడీపీ నాయకుడు నెలవల రాజేష్ తెలిపారు. ఆయన గురువారం రాత్రి మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీతో కలిసి స్వర్ణముఖి ఏటి పండుగలో పాల్గొని ఈ విషయాన్ని ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ దర్గాకు సంబంధించిన ఆస్తులతో పాటు ఉరుసు వేడుకల విషయమై ఇరువర్గాల వారు కోర్టును ఆశ్రయించడంతో 9 ఏళ్లుగా ఉరుసు వేడుకలు జరగడం లేదన్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల వారితో చర్చించి ఏప్రిల్‌లో ఉరుసు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



విజేతకు బహుమతి ఇస్తున్న చేవూరు నాగరాజు

చిల్లకూరు : సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని ఏరూరు గ్రామంలో ఉన్న శివగణేష్ క్రీడా మైదానంలో చేవూరు చెంచురామయ్య జ్ఞాపకార్థం నాలుగు రోజులు నిర్వహించిన క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఇందులో 8 జట్లు పాల్గొనగా ఫైనల్స్‌లో అల్లీపురం, పుట్టయ్య జట్లు తలపడ్డాయి. అల్లీపురం జట్టు విజయం సాధించింది. విజేతలకు చిల్లకూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చేవూరు నాగరాజు బహుమతిగా రూ.20 వేల నగదు, షీల్డ్ అందజేశారు. రన్నర్‌గా నిలిచిన పుట్టయ్య జట్టుకు రూ.10 వేలు, మూడో బహుమతిగా సెమీ ఫైనల్స్‌లో నిలిచిన కావలిపాళెం జట్టుకు రూ.5 వేలు ఇచ్చారు.

ఘనంగా గౌరమ్మ నిమజ్జనం



గొబ్బెమ్మను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

దక్కిలి : మండలంలో శుక్రవారం గౌరమ్మ నిమజ్జనాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి మహిళలు ప్రతి రోజూ సాయంత్రం గ్రామంలో గౌరమ్మ ప్రతిమను ఏర్పాటు చేసి గొబ్బిళ్లు తట్టి, గొబ్బి పాటలతో భక్తి గీతాలు ఆలపిస్తారు. సంక్రాంతి పండుగ అనంతరం గౌరమ్మను నిమజ్జనం చేస్తారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం వేప మండపంలో గౌరీ దేవిని కొలువుదీర్చి ఆలయం చుట్టూ ముగ్గులు వేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం ఊరేగింపుగా తీసుకెళ్లి ఆయా గ్రామాల చెరువుల్లో నిమజ్జనం చేశారు.

ఘనంగా గొబ్బెమ్మ ఊరేగింపు

సైదాపురం : మండలంలోని సైదాపురం, కమ్మవారిపల్లి, గిద్దలూరు, కలిచేడు, తురిమెర్ల గ్రామాల్లోని ఎస్టీ కాలనీల్లో శుక్రవారం అత్యంత వైభవంగా గొబ్బెమ్మ కు పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గ్రామాల్లో ఊరేగించారు. భక్తులు విచిత్ర వేషధారణలో నృత్యాలు చేశారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

కోట : మండలంలో దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని ఎంపీటీసీలు, సర్పంచులు కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో వేణు ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించారు. కోరం లేకపోయినా తూతూమంత్రంగా సమావేశం నిర్వహించి చేతులు దులుపుకున్నారు. ఎంపీపీ, ఇద్దరు వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ, పలువురు ఎంపీటీసీలు సమావేశానికి హాజరుకాలేదు. మండలంలో రోడ్ల దుస్థితిపైనే ప్రధానంగా చర్చ సాగింది. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజాప్రతినిధులు కోరారు. తహసీల్దార్ జయజయరావు, ఎంఈవో మస్తానయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి



డైరీలు ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్, జేసీ, సబ్ కలెక్టర్

చిల్లకూరు : ఉపాధి హామీ కూలీలకు ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్ ఆదేశించారు. ఆయన శుక్రవారం సూళ్లూరుపేటలో ఉపాధి హామీ పథకంలో పని చేసే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ డైరీలు, జాబ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శుభంభన్సల్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనన్, ఉపాధి హామీ పథకం పీడీ శ్రీనివాసప్రసాద్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, చిల్లకూరు ఏపీవో గిరిబాబు, అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు

సైదాపురం/రాపూరు : కుష్టువ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సైదాపురం పీహెచ్‌సీ, రాపూరు మండలంలోని వేపనాపి వైద్యాధికారులు డాక్టర్ నిత్యప్రశాంతి, డాక్టర్ ప్రమీలరాజ కుమారి తెలిపారు. వారు శుక్రవారం కుష్టువ్యాధిగ్రస్తుల సర్వేపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ప్రతి ఇంటికీ వెళ్లి కుష్టువ్యాధిగ్రస్తుల సర్వే చేయాలన్నారు. కుష్టువ్యాధిని ముందుగానే గుర్తిస్తే మందులతో నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సారకాయల శెట్టి, డాక్టర్ జుఫిభాను, సిబ్బంది పుష్పమ్మ, సీహెచ్ శ్రీనివాసులు, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్

నాయుడుపేట టౌన్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర –స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా తెలిపారు. ఆయన శుక్రవారం వార్డు సచివాలయాల శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ దివస్ పేరిట ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలతో పాటు 25 వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించి క్లీన్ అండ్ గ్రీన్‌లో నాయుడుపేటను ప్రథమ స్థానంలో నిలపాని పిలుపునిచ్చారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఇళ్ల వద్దకు వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు ఇచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

సిద్ధవరంలో పొలం పిలుస్తోంది

వెంకటగిరి రూరల్: వరిపంట సాగుచేస్తున్న రైతులు ఎకరాకు 20 కేజీల చొప్పున పొటాష్ చల్లాలని ఏడీఏ నాగార్జునసాగర్ తెలిపారు. ఆయన శుక్రవారం సిద్ధవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంటలు సాగుచేసిన ప్రతి రైతూ తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీ స్వామిబాబు, ఏవో సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వెంకటగిరి రూరల్ : వెంకటగిరిలోని పాలకేంద్రం వద్ద ఉన్న 132 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు డీఈఈ ముని రవిచంద్ర తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేస్తున్నందున మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వెంకటగిరి టౌన్, రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలియజేశారు.

యారా గురునాథస్వామి గ్రామోత్సవాలు ప్రారంభం

చిల్లకూరు : తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయ అనుబంధ యారా గురునాథస్వామి గ్రామోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తూర్పుకనుపూరు పంచాయితీలోని తూర్పుకనుపూరు, కోమరావారిపాళెం, ఈదుల వారిపాళెం, పోసిన వారిపాళెం, రావులవారి పాళెంలో గ్రామోత్సవం నిర్వహించిన తర్వాత స్వామిని తూర్పుకనుపూరుకు తీసుకువస్తారు. ఈ మేరకు దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో రాత్రి బస చేసిన సమయంలో స్వామి వారి విగ్రహాలకు కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నారు. కార్యక్రమాలను ఆలయ ఈవో నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.

వేధింపుల కేసులో భర్తకు ఆరు నెలల జైలు

గూడూరు రూరల్ : గూడూరు రూరల్ పరిధిలోని తిప్పవరప్పాడుకు చెందిన బొచ్చు ప్రసన్నకుమారి 2016లో తన భర్త సురేంద్ర వేధింపులకు గురి చేస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అప్పట్లో సురేంద్రపై కేసు నమోదు చేశారు. గూడూరు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ లోకనాథం కేసును విచారించారు. సురేంద్రపై నేరం నిరూపణ కావడంతో ఆరు నెలలు జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పినట్టు గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. కేసును ఏపీపీ లక్ష్మీనారాయణ వాదించారు.

ఉద్యోగుల సంక్షేమమే ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ ధ్యేయం

- అసత్య ఆరోపణలు తగదు
- ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి



ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి

కోట : మండలంలోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ బోధనేతర సిబ్బంది కొందరు నిరాధార ఆరోపణలు చేస్తూ కళాశాలపై బురదజల్లడం తగదని కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కళాశాల యాజమాన్యం ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. వారి పట్ల సానుకూల దృక్పథంతో ఉందన్నారు. 250 మంది కంటే ఎక్కువ మంది సభ్యులున్న యూనియన్‌కు ఎలాంటి సమస్యలు లేవని, వారికి జీతాలు, అలవెన్స్‌లు అన్నీ సకాలంలో అందుతున్నాయన్నారు. కొందరు ఎంప్లాయీస్ యూనియన్ పేరుతో బయట సమావేశాలు నిర్వహించి కళాశాల ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని పేర్కొన్నారు. గుంటూరులోని లేబర్ కోర్టు ఇచ్చిన తీర్పుపై ఏపీ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశామన్నారు. అదేవిధంగా నెల్లూరు కోర్టులో కూడా మరో కేసు నడుస్తోందని వెల్లడించారు. కోర్టు పరిధిలో ఉన్న అంశాలపై సంస్థకు వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడరాదని, కొందరు ఉద్దేశపూర్వకంగా ఎంప్లాయీస్ యూనియన్ పేరుతో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని తెలిపారు. కళాశాల యాజమాన్యం ఏ ఉద్యోగి పట్ల వివక్ష చూపదని, ఉద్యోగుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్టు వివరించారు.

కాటికి పోవాలంటే కోటి కష్టాలు



పోలమ్మ మృతదేహాన్ని పంట పొలాల గుండా తీసుకెళుతున్న బంధువులు



పొలాల మధ్య అంత్యక్రియలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

బాలాయపల్లి (సైదాపురం) : బాలాయపల్లి మండలంలోని కాట్రగుంట గ్రామానికి చెందిన శ్మశాన దారి ఆక్రమణకు గురైంది. దీంతో గ్రామంలో ఎవరైనా మరణిస్తే వారికి అంత్యక్రియలు నిర్వహించేందుకు వారి బంధువులకు తిప్పలు తప్పడం లేదు. గ్రామంలో 36 కుటుంబాలు ఉన్నాయి. సుమారు 500 మందిపైగా జనాభా ఉంది. కిలోమీటరు దూరంలో శ్మశానం ఉంది. అక్కడికి వెళ్లేందుకు గతంలో కాలిబాట ఉండేది. కొంతమంది దారిని ఆక్రమించుకుని పంటలు సాగు చేశారు. దీంతో మృతి చెందిన వారిని శ్మశానానికి తీసుకెళ్లేందుకు గ్రామస్తులు పంట పొలాల్లో వెళ్లాల్సి వస్తోంది. గ్రామానికి చెందిన పల్లాల పోలమ్మ (47) శుక్రవారం మృతి చెందింది. ఆమెకు అంత్యక్రియలు నిర్వహించేందుకు గ్రామస్తులు కష్టాలు పడాల్సి వచ్చింది. వరిపంట మధ్యలో నడుస్తూ వెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. అధికారులకు స్పందించి శ్మశానానికి దారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వసతులు కల్పించాలని వినతి



సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న యువకులు

కలువాయి: మండలం తోపుగుంట అగ్రహారంలో మౌలిక వసతులు కల్పించాలని గ్రామానికి చెందిన యువకులు కోరారు. వారు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదని, రోడ్లు దారుణంగా ఉన్నాయని, పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని పేర్కొన్నారు. ఇటీవల ఎస్టీ కాలనీలో జ్వరాలు ప్రబలాయని, చాలామంది జ్వరాల బారిన పడ్డారని తెలిపారు. మురుగు కాలువలు నిర్మించాలని, సీసీ రోడ్లు వేయాలని కోరారు.